క్లుప్తంగా

అనుమానిత వ్యక్తుల సమాచారం ఇవ్వండి



తునిలో ఆటో డ్రైవర్లకు సూచనలిస్తున్న జీఆర్పీ ఎస్సై అబ్దుల్ మారూఫ్

తుని: రైల్వేస్టేషన్లో అనుమానిత వ్యక్తులు కనిపిస్తే తక్షణమే రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వాలని స్థానిక జీఆర్పీ ఎస్సై షేక్ అబ్దుల్ మారూఫ్ సూచించారు. తుని, అన్నవరం రైల్వేస్టేషన్లలో ఆటోలు నిలిపే ఆటోడ్రైవర్లతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, లిక్కర్ వంటి నిషేధిత వస్తువులు భారీగా ఆటోల్లో తీసుకొచ్చి రైలులో ప్రయాణించేదుకు ప్రయత్నించే వారి సమాచారం, రైలులో ప్రయాణికుల నుంచి బాగులు, సెల్‌ఫోన్లు, బంగారు నగలు, విలువైన వస్తువులు దొంగిలించే వారి సమాచారం పోలీసులకు అందించాలని కోరారు. రైల్వే ప్రయాణికులతో గౌరవంగా మెలగాలని, ప్రతి డ్రైవర్ వద్ద లైసెన్స్, ఇన్సూరెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు ఉండాలన్నారు. హెడ్ కానిస్టేబుల్ శ్యాము, రైల్వే పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఎలక్ట్రీషియన్ల దినోత్సవం



గోకవరంలో ర్యాలీ చేస్తున్న ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ సభ్యులు

గోకవరం: ప్రపంచ ఎలక్ట్రీషియన్ల దినోత్సవాన్ని శనివారం గోకవరంలో ఘనంగా నిర్వహించారు. గోకవరం యునైటెడ్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ కార్యాలయం వద్ద సంఘ నాయకులు జెండాను ఎగురవేశారు. థామస్ ఆల్వా ఎడిసన్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. యూనియన్ అధ్యక్షుడు ఎం.కార్తీక్, గౌరవాధ్యక్షుడు ఎంఎస్‌వీఎస్ రాజు, పాలెపు నాగేశ్వరరావు, కంబాల బాబ్జి, గునిపల్లి శివ, సూర్యప్రకాష్, దుర్గ, అర్జునుడు తదితరులు పాల్గొన్నారు.

నేటి మహాసభను విజయవంతం చేయాలి

తొండంగి: బడుగు, బలహీన వర్గాల సమస్యల పరిష్కారం కోసం పెద్దాపురంలో ఆదివారం మహాజన సోషలిస్ట్ పార్టీ (ఎంఎస్‌పీ) ఆధ్వర్యంలో నిర్వహించే మహాసభను విజయవంతం చేయాలని ఆ పార్టీ తుని నియోజకవర్గ కన్వీనర్ కింతాడ సత్తిబాబు పిలుపునిచ్చారు. మండలంలోని ఒంటిమామిడిలో శనివారం ఎంఎస్‌పీ మండలస్థాయి సమావేశం నిర్వహించారు. పెద్దాపురం సభ విజయవంతంపై చర్చించారు. తుని, తొండంగి, కోటనందూరు మండలాల నుంచి యువత తరలివచ్చి ఈ మహాసభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యుడు ఉలగాటి సామ్యూల్, పాలాద్రి శివ, షేక్ మీరా సాహేబ్ తదితరులు పాల్గొన్నారు.

వాహనం బహూకరణ

కోటనందూరు: స్థానిక అల్లూరి సీతారామరాజు సేవా కమిటీకి విశాఖపట్నానికి చెందిన దాత సరసా రాజబాబు రూ.1.5 లక్షల విలువ చేసే వాహనాన్ని బహూకరించారు. కోటనందూరులో శనివారం సేవా కమిటీ సభ్యులకు దాత రాజబాబు వాహనాన్ని అందజేశారు. వాహనాన్ని వినియోగించి ప్రజలకు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని కమిటీ సభ్యులకు సూచించారు. దాత ఔదార్యం పట్ల సంస్థ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దాడి చెల్లారావు, సరసా సాయి, దాడి శ్రీను పాల్గొన్నారు.

అన్నసమారాధన

జగ్గంపేట: స్థానిక రావులమ్మతల్లి ఆలయం వద్ద శనివారం అన్నసమారాధన నిర్వహించారు. అమ్మవారి తీర్థ మహోత్సవాల ముగింపును పురస్కరించుకుని దాతల సహకారంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదానం నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

భక్తిశ్రద్ధలతో పారాయణ



ఏలేశ్వరంలో పారాయణ చేస్తున్న మహిళలు

ఏలేశ్వరం: స్థానిక మార్కెట్‌వీధిలోని రూపులమ్మ అమ్మవారి ఆలయం వద్ద విశ్వహిందూ పరిషత్ అనుబంధ మాతృశక్తి, దుర్గావాహిని మహిళా సంఘాల ఆధ్వర్యంలో శనివారం శివ స్తోత్రాలు, లలితాసహస్ర పారాయణ చేశారు. అనంతరం దుర్గాదేవి భక్తిగీతాలు ఆలపించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ కార్యదర్శి కటకం కిరీటీ, సంఘ సభ్యులు తూమురౌతు గురయ్య, ఉడతల రమణారావు, కామాక్షి, రమాదేవి, హైమావతి, సుభాషిణి, సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలకు చెక్

- కొత్తపల్లిలో 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు పూర్తి
- త్వరలో అందుబాటులోకి రానున్న వైనం
- తీరనున్న కరెంట్ కష్టాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



కొత్తపల్లిలో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్

గోకవరం: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. గ్రామాలకు నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంది. గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో ఇళ్లకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు అదనపు సబ్‌స్టేషన్ల నిర్మాణాలు చేపట్టారు. దీనిలో భాగంగా గోకవరం మండలం కొత్తపల్లిలో సుమారు రూ.4.5 కోట్లుతో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి రెండేళ్ల క్రితం ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు శంకుస్థాపన చేశారు. ఈ సబ్‌స్టేషన్ నిర్మాణం దాదాపు పూర్తయ్యి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది.

గ్రామాలకు నాణ్యమైన విద్యుత్

గోకవరం మండలంలో 14 పంచాయతీలు ఉండగా సుమారు 30 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో కొత్త ఊళ్లు (జగనన్న కాలనీలు) ఏర్పాటు అవుతున్నాయి. కొత్తపల్లి శివారున పేద ప్రజలకు మంజూరు చేసిన జగనన్న కాలనీలో సుమారు 1100 ఇళ్లు నిర్మిస్తున్నారు. ఈ కాలనీకి నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలనే లక్ష్యంతో ఈ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను చురుగ్గా చేపట్టారు.

గోకవరం, తంటికొండ విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో...

మండలంలో గోకవరం, తంటికొండ గ్రామాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. ఇప్పటి వరకు గోకవరం సబ్‌స్టేషన్ నుంచి కొత్తపల్లి, కామరాజుపేట, శివరామట్నం, సూదికొండ, జగన్నాథపురం, భూపతిపాలెం, మల్లవరం, ఠాకూరుపాలెం, గంగంపాలెం, తిరుమలాయపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా అవుతోంది. వీటిలో పలు గ్రామాలు అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉండటంతో వర్షాకాలం, ఈదురు గాలుల సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. నిర్మాణంలో ఉన్న సబ్‌స్టేషన్ అందుబాటులోకి వస్తే ఈ గ్రామాలకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుంది. సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావడంతో పలు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అంతరాయం లేకుండా విద్యుత్



కొత్తపల్లిలో నిర్మిస్తున్న 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ అందుబాటులోకి వస్తే ప్రజలకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అవుతుంది. ఇప్పటికే సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. త్వరలోనే సబ్ స్టేషన్ అందుబాటులోకి వస్తుంది.

– సుంకర వీరబాబు, వైఎస్సార్ సీపీ నేత, గోకవరం

విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాల్సి ఉంది



కొత్తపల్లిలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం దాదాపు పూర్తయ్యింది. విద్యుత్ లైన్లు వేరు చేసి సబ్‌స్టేషన్ నుంచి నూతనంగా లైన్లు వేయాల్సి ఉంది. త్వరలోనే ఈ పనులు పూర్తి చేస్తాం. ఈ సబ్‌స్టేషన్ అందుబాటులోకి వస్తే పలు గ్రామాలకు నాణ్యమైన విద్యుత్ అందుతుంది.

– దాట్ల శ్రీధర్‌వర్మ, ఈఈ, ఏపీఈపీడీసీఎల్, రాజమహేంద్రవరం రూరల్

వెంకన్న ఆలయానికి భక్తుల తాకిడి

గండేపల్లి: మండలంలోని తాళ్లూరులో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. పండితులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుంచి వందలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా సత్యదేవుని ప్రాకార సేవ



సత్యదేవుడు, అమ్మవారిని తిరుచ్చి వాహనం మీద ఊరేగిస్తున్న భక్తులు

అన్నవరం: రత్నగిరిపై శనివారం సత్యదేవుని ప్రాకార సేవ ఘనంగా నిర్వహించారు. పండితులు ఉదయం 10 గంటలకు స్వామి, అమ్మవార్లను తిరుచ్చి వాహనం మీద ప్రతిష్ఠించి ఊరేగింపుగా తూర్పురాజగోపురం వద్దకు తీసుకువచ్చారు. అక్కడ ప్రత్యేక పూజలు చేసి వేద మంత్రాలు, బాజాభజంత్రీల నడుమ స్వామి, అమ్మవార్లను తిరుచ్చి వాహనం మీద మూడు సార్లు ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. అనంతరం పూజలు చేసి స్వామి, అమ్మవార్లను తిరిగి ప్రధానాలయానికి చేర్చారు. కార్యక్రమంలో అర్చకుడు శ్రీకాకుళపు వరదయ్య, దేవస్థానం సూపరింటిండెంట్ స్వామీజీ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి విశేష ప్రజాదరణ



రాచపల్లి ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అనంతబాబు, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు

- ఎమ్మెల్సీ అనంతబాబు, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు
- రాచపల్లిలో ఆత్మీయ సమావేశం

ప్రత్తిపాడు రూరల్: ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు ప్రజలకు ఆమోదయోగ్యంగా ఉన్నాయని, ఫలితంగా వైఎస్సార్ సీపీకి రోజురోజుకూ ప్రజాదరణ పెరుగుతోందని ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ (అనంతబాబు), వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని రాచపల్లిలో శనివారం మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఏనుగు శ్రీను (బంకు శ్రీను) ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ అనంత బాబు, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో మునుపెన్నడూ లేని రీతిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. పేదలు, బడుగు, బలహీన వర్గాల ప్రజలను ఆర్థికంగా బలోపేతం చేసిన ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రజల చెంతకే పాలనను తీసుకువచ్చారన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీని మరింత బలోపేతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు, శంఖవరం ఎంపీపీలు గోళ్ల కాంతి సుధాకర్, పర్వత రాజబాబు, జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, వైఎస్సార్ సీపీ మాజీ మండల కన్వీనర్ బెహరా దొరబాబు, గ్రామ సర్పంచ్ సారిపల్లి లోవలక్ష్మి, ఏపూరి రాంబాబు, పార్టీ నాయకులు ఒమ్మి వెంకటరమణ, పెద్దిరెడ్డి నాని బాబు, ఎంపీటీసీలు ఉమ్మిడి తాతీలు, అమరాది కాశీ, సొసైటీ చైర్మన్ కొప్పన గంగారావు, జువ్వల బాబులు, పార్టీ యూత్ లీడర్ రామిశెట్టి బులి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భూహక్కు చట్టంపై అవగాహన

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పాండవులపాలెంలో శనివారం ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) ఆధ్వర్యంలో భూహక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలాజ్ ప్రతినిధి బుగత శివ మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం 2022లో తీసుకువచ్చిన భూహక్కు చట్టాన్ని (యాక్ట్ నెంబర్ 27/23) వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ చట్టం వలన పేదలకు ఉపయోగం లేదన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు అవసరాల దేవి, ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ సంఘం అధ్యక్షుడు రేచుకట్ల సింహాచలం, స్థానిక నాయకులు రెల్లి సత్యనారాయణ, ఇరట గడ్డియ్య, ఇరటా వీరబాబు, బండి సత్యవతి, కర్రి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా వెంకటరావు



తుని: తుని మున్సిపల్ కమిషనర్‌గా ఎ.వెంకటరావు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకూ ఇక్కడ కమిషనర్‌గా పని చేసిన బీజేఎస్ ప్రసాదరాజును ఏలూరి అర్బన్ డెవలప్‌మెంట్ అథారటీ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ప్రస్తుతం ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పని చేస్తున్న వెంకటరావు బదిలీపై ఇక్కడకు వచ్చారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, పట్టణ ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

స్వర్ణ పతకం విజేతకు అభినందనలు



స్వర్ణ పతకం విజేత నవీన్‌ను అభినందిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

తుని: జాతీయ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించిన క్రీడాకారుడిని రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అభినందించారు. గోవా ఇటీవల జరిగిన జాతీయ పారా అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో కోటనందూరు మండలం కొత్తకొట్టాం గ్రామానికి చెందిన సుర్ల నవీన్ పాల్గొన్నారు. పురుషుల 400 మీటర్ల పరుగు విభాగంలో 54.2 సెకన్ల వ్యవధిలో లక్ష్యాన్ని ఛేదించి స్వర్ణ పతకం సాధించాడు. అలాగే 1500 మీటర్ల పరుగు (టీ 12) పోటీల్లో వెండి పతకం సాధించాడు. తుని మండలం ఎస్.అన్నవరంలోని క్యాంపు కార్యాలయంలో శనివారం సుర్ల నవీన్ మంత్రి దాడిశెట్టి రాజాను మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి రాజా నవీన్‌ను శాలువా, పూలమాలతో సత్కరించారు. నగదు బహుమతి అందించి అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కోటనందూరు ఎంపీపీ శ్రీనివాస్, దొగ్గా బాబులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



తుని పట్టణంలో రోడ్డు భద్రతపై ర్యాలీ చేస్తున్న పోలీసులు

తుని: రోడ్డు ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కత్తిపూడి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్(ఎంవీఐ) బి.శ్రీనివాస్ సూచించారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలోని ప్రధాన వీధుల్లో 500 మంది విద్యార్థులతో రోడ్డు ప్రమాదాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్, సీటుబెల్టు ధరించకపోవడం, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం కలిగే అనర్థాలపై ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంవీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ వచ్చే పదేళ్లలో రోడ్డు ప్రమాదాలను 50 శాతం తగ్గించడమే లక్ష్యంగా రోడ్డు భద్రత వారోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. రోడ్డు ప్రమాదాలపై ప్రజలు అవగాహన పెంచుకొని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోడ్డు భద్రత నియమాలను పాటిస్తూ అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పట్టణ ఎస్సై రామలింగేశ్వరరావు, పోలీసు, ఆర్టీఓ సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షనర్ల భవనానికి ఫర్నిచర్ బహూకరణ



జగ్గంపేట పెన్షనర్ల భవనానికి అందజేసిన ఫర్నిచర్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ గంగాధరరావు

జగ్గంపేట: స్థానిక పెన్షనర్ల భవనానికి రూ.25 వేల విలువైన ఫర్నిచర్‌ను దాత మేకా గంగాధరరావు బహూకరించారు. జగ్గంపేటలో శనివారం పెన్షనర్ల సంఘ అధ్యక్షులు చంద్రమౌళి వెంకటశాస్త్రి అధ్యక్షతన జరిగిన సమావేశంలో గంగాధరరావు ఆఫీస్ టేబుల్స్, కుర్చీలు, మీటింగ్ నిర్వహించడానికి అవసమైన ఇతర పరికరాలను సంఘ సభ్యులకు అందజేశారు. సంఘ సభ్యులు దాత డాక్టర్ గంగాధరరావును పూలమాల, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొత్త కొండబాబు, సంఘం నేతలు తోలేటి సూర్యనారాయణ, దువ్వాడ అమృతరావు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- కత్తిపూడి, సీతంపేట గ్రామాల్లో ప్రభుత్వ భవనాలు ప్రారంభం



సీతంపేటలో సచివాలయ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

శంఖవరం: గ్రామ సచివాలయ వ్యవస్థతో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని కత్తిపూడి, సీతంపేట గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్ భవనాలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయన్నారు. వలంటీర్ వ్యవస్థతో లబ్ధిదారుల ఇంటికే సంక్షేమ ఫలాలు నేరుగా చేరుతున్నాయని తెలిపారు. రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు తక్కువ ధరలకే లభిస్తున్నాయన్నారు. హెల్త్ క్లినిక్ ద్వారా వైద్యం ప్రజలకు మరింత చేరువైందని చెప్పారు. పారదర్శక పాలన అందిస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచులు కొల్లు సత్తిబాబు, తోట నాగదేవి, వైఎస్సార్ సీపీ నాయకులు గాబు కృష్ణ, గౌతు నాగు, తోట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యంపై కేసు

జగ్గంపేట: యువకుడి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు స్థానిక ఏఎస్ఐ సుబ్బారావు శనివారం తెలిపారు. మండలంలోని జె. కొత్తూరు గ్రామానికి చెందిన రాయుడు విష్ణు ఈ నెల 24న జగ్గంపేట డిగ్రీ కాలేజీలో పని ఉందని ఇంట్లో చెప్పి బయలుదేరాడు. అప్పటి నుంచి అతడు ఇంటికి రాకపోగా, ఫోన్ స్విచ్ఛాఫ్ అయ్యింది. కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద వెతికినా అతని ఆచూకీ లభించకపోవడంతో శనివారం అతని తండ్రి రాయుడు శ్రీను పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ సుబ్బారావు తెలిపారు.

పార్టీ విజయానికి సైనికుల్లా పని చేయాలి

- మాజీ ఎంపీ తోట నరసింహం



సమావేశంలో మాట్లాడుతున్న తోట నరసింహం

కిర్లంపూడి: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. వీరవరంలో వైఎస్సార్ సీపీ మండలస్థాయి నాయకులు, కార్యకర్తలతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 1న ఏలూరు జరిగే 'సిద్ధం' మహాసభను విజయవంతం చేయాలన్నారు. బడుగు, బలహీన వర్గాలు ఆర్థికంగా ఎదిగేందుకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ భారీ మెజార్టీతో విజయం సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో తోట బాబ్జీ, పెనగంటి రాజేష్, తోట వేణు, పాతంశెట్టి కృష్ణమూర్తి, మాజీ సర్పంచ్ లక్ష్మీపార్వతి, తోట అయ్యన్న, ఓలేటి రాజు, అడబాల సుబ్బారాయుడు, పలికల గంగరాజు, బేరీ బాబ్జి, అడారి మహేష్, పాముల చంటి, వేగి రామకృష్ణ, కర్రి రమణమూర్తి, కోదండ రామ్, సరిసే సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలుగా అక్కాచెల్లెళ్లు



బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలుగా నిలిచిన అక్కాచెల్లెళ్లు సుధ, ధరణి

ఏలేశ్వరం: ప్రత్తిపాడులో ఇటీవల నియోజకవర్గ స్థాయి ఆడుదాం–ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఏలేశ్వరం మండలానికి చెందిన అక్కాచెల్లెళ్లు అడ్డూరి సుధ, ధరణి బ్యాడ్మింటన్ మహిళల డబుల్స్ విభాగంలో ప్రథమ బహుమతిని కై వసం చేసుకున్నారు. బ్యాడ్మింటన్ మహిళల డబుల్స్ విభాగంలో జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన బ్యాడ్మింటన్ క్రీడాకారులను ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ బ్యాడ్మింటన్ డబుల్స్ పోటీల్లో తొలి మూడు స్థానాల్లో గెలుపొందిన విజేతలకు రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు చొప్పున ప్రోత్సాహకాలు అందజేయనున్నట్లు తెలిపారు.

వచ్చే ఎన్నికల్లో విజయం ఖాయం



దిగువశివాడలో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు
- పలు గ్రామాల్లో ఆత్మీయ సమావేశాలు

రౌతులపూడి: ప్రతిపక్షాలు ఏకమై ఎన్ని కుయుక్తులు పన్నినా వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయాన్ని ఆపలేరని ఆ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని దిగువశివాడ, గంగవరం, రాజవరం, రామకృష్ణాపురం, ములగపూడి గ్రామాల్లో శనివారం ఆయన ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు 100 శాతం అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజల మద్దతుతో తిరిగి అధికారంలోకి రావటం ఖాయమన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అన్నివర్గాలకూ మేలు జరిగిందన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో శంఖవరం ఎంపీపీ పర్వత రాజబాబు, జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చిన దివాణం, అన్నవరం ట్రస్టుబోర్డు మాజీ డైరెక్టర్ వాసిరెడ్డి జమీలు, మండల వ్యవసాయ సలహా కమిటీ సభ్యుడు వాసిరెడ్డి భాస్కరబాబు, సొసైటీ మాజీ అధ్యక్షుడు సోమరౌతు భాస్కరబాబు, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సీహెచ్‌వీవీ సత్యనారాయణ, రుత్తల సత్యనారాయణ, దిగువశివాడ సర్పంచ్ కొరుప్రోలు దేవుడు, పార్టీ నాయకులు పంచాడ అశోక్, సైపురెడ్డి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం



కాత్రావులపల్లిలో కనకదుర్గమ్మ ఆలయానికి శంకుస్థాపన చేసిన తోట నరసింహం

జగ్గంపేట: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పని చేయాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం సూచించారు. మండలంలోని కాత్రావులపల్లి జగనన్న కాలనీలో నూతనంగా నిర్మించే కనకదుర్గమ్మ ఆలయానికి శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనకదుర్గమ్మ ఆలయ నిర్మాణానికి తన వంతు ఆర్థిక సాయం అందిస్తానన్నారు. వేంకటేశ్వరస్వామి ఆలయానికి తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి నిధులు మంజూరు చేయిస్తామని చెప్పారు. వచ్చే ఎన్నికలలో జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం, పార్టీ నాయకులు అత్తులూరి సాయిబాబు, గఫూర్, జగాల్, జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పెద్దాడ రాజబాబు, సూరిమిల్లి దొరబాబు, గ్రామ సర్పంచ్ పిట్టా సుగుణరావు, తదితరులు పాల్గొన్నారు.